సాక్షి
వనపర్తి
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



ఐదో వసంతంలోకి 'పేట'

నారాయణపేట జిల్లా శుక్రవారం ఐదో వసంతంలోకి అడుగిడింది.

వివరాలు 8లో ▸



బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

అలంపూర్ నవబ్రహ్మ ఆలయాలు మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /17.3

ఉదయం శీతల గాలులు వీచే అవకాశం ఉంది. రోజంతా వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

హజ్ యాత్రకు దరఖాస్తుల స్వీకరణ



వనపర్తి క్రైం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ఖలీద్ ఇమాం సహబ్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలో కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని.. చివరి గడువు మార్చి 10తో ముగుస్తుందని వివరించారు. దరఖాస్తుదారుడు పూర్తి వివరాలతో పాటు 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, బ్యాంకు పాస్‌బుక్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్ 9247268638 సంప్రదించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు మునీరుద్దీన్, మౌలానా అన్వర్, అక్తర్, రహీం, గులాం ఖాదర్, అనీస్ బిన్, అఫ్సర్, దస్తగిరి, పాషా తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్



వనపర్తిటౌన్: జిల్లాలో రెండోరోజు గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 1,418 మందికి గాను 1,324 మంది హాజరుకాగా.. 94 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,089 మందికిగాను 1,037 మంది హాజరుకాగా.. 52 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ జాకీర్ హుస్సేన్ తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం



వనపర్తి క్రైం: జిల్లాకేంద్రంలోని చింతల హనుమాన్ ఆలయ శివదీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానానికి పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో సేవాసమితి సభ్యులకు నగదును అందించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, బుచ్చన్న, సేవాసమితి అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధానకార్యదర్శి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం

గోపాల్‌పేట: యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడమంటే రద్దు చేసే కుట్రగా వివరించారు. కార్పొరేట్లకు దోచిపెడుతూ కూలీల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రూ.90 వేల కోట్లున్న కేటాయింపులను రూ.60 వేల కోట్లకు తగ్గించిందని తెలిపారు. 200 పనిదినాలు కల్పించడంతో పాటు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అబ్రహం, జిల్లా కమిటీ సభ్యుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఫుడ్‌కోర్టులు!

ప్రయాణ ప్రాంగణాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు



కొత్తకోటలోని ప్రయాణ ప్రాంగణం

- చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఆహార పదార్థాల విక్రయం
- జిల్లాలోని మూడు బస్టాండ్లలో.. స్థలాల ఎంపిక ప్రక్రియ షురూ...
- మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులకే అవకాశం

వనపర్తి: తెలంగాణ ఏర్పాటు తర్వాత కులవృత్తులకు ఆశించిన మేర ప్రోత్సాహం లభిస్తోంది. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో ప్రభుత్వమే ఉచితంగా చేప పిల్లలను వదలటంతో మత్స్యకారులకు ఆర్థిక భరోసా లభించింది. వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఆహార పదార్థాలను విక్రయించేందుకు బస్టాండ్లలో ఫిష్ ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జనవరి రెండోవారంలో మత్స్యభవన్ నుంచి ఆ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లచ్చిరామ్ భూక్యా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని మూడు బస్టాండ్లలో ఏర్పాటు చేసి అవి విజయవంతంగా నడిస్తే మిలిగిన వాటిలో ఏర్పాటు చేయనున్నారు. మత్స్యకారులు ఫిష్ ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఆర్టీసీ బస్టాండ్‌లో అయిదేళ్ల లీజుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మత్స్యశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆర్టీసీ రీజియన్ మేనేజర్లకు అధికారిక లేఖలు అందాయి. ప్రస్తుతం ప్రయాణ ప్రాంగణాల్లో ఉన్న క్యాంటీన్, వాటర్, ఇతర వ్యాపార దుకాణాల మాదిరిగానే.. చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఫ్రై, కర్రీ, చెట్నీలు ప్రయాణికులకు అందుబాటులో ఉంచే అవకాశం ఉంది.

జిల్లాలో ఇలా..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు	124
మార్కెటింగ్ సంఘాలు	2
మహిళా సంఘాలు	16
సాధారణ సంఘాలు	106
సభ్యుల సంఖ్య	11,574

కొత్త సభ్యత్వాలు త్వరలో నమోదు కానున్నాయి.

1,017 చెరువుల్లో 229 కోట్ల చేప పిల్లలు..

ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలోని 1,017 మత్స్యశాఖ చెరువులు, రిజర్వాయర్లు, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో 229 కోట్ల చేప పిల్లలను వదిలారు.

ఆరోగ్య ఆహారం..

రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో ఏటా కోట్లలో చేప పిల్లలను వదిలి పెరిగిన తర్వాత వేసవిలో వాటిని పట్టి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అలాకాకుండా స్థానికంగా పెంచిన చేపలు ఈ ప్రాంతాల వారికి సరిపడా వినియోగించాకే మిగిలినవి ఎగుమతి చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గ్రామీణులకు సైతం ఆరోగ్యకరమైన చేపలు, రొయ్యల ఆహారం చౌకగా, అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఫిష్ ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

సంఘంలో సభ్యత్వం తప్పనిసరి..

ఫిష్ ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న వారికే అవకాశం ఉంటుంది. సభ్యత్వం, ఆసక్తి ఉన్న వారు ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ అనుమతి, ప్రోత్సాహకం అందించేలా నిబంధనలను రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన చేపల మార్కెట్లు వృథాగా ఉండటంతో.. ప్రభుత్వం ఈ ఆలోచనను తెరపైకి తీసుకొచ్చింది. మాంసం ధరలు సామాన్యులు కొనలేని స్థాయికి చేరడంతో ఆరోగ్యకరమైన, బలవర్ధకమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్న చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఆహారం ప్రజలకు అందుబాటులోకి రానుంది.

మూడుచోట్ల స్థలాల పరిశీలన..



ఆర్టీసీ బస్టాండ్లలో ఫిష్ ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలని నెలక్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని ప్రయాణ ప్రాంగణాల్లో స్థలాల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నాం. జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో స్థలం ఎంపిక దాదాపు ఖరారైంది. కొత్తకోట, పెబ్బేరులో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న వారు మాత్రమే ఫిష్ ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది.

– రహమాన్, జిల్లా ఇన్‌చార్జ్ మత్స్యశాఖ అధికారి

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- ఇద్దరు అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సస్పెన్షన్

పాన్‌గల్: విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉద్యోగులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి వైద్యుడు డా. హరినాథ్‌రెడ్డితో మాట్లాడి ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఒకటి, మూడో అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయులు ఇందిరమ్మ, తిరుపతమ్మ విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇద్దరిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఓ ఉపాధ్యాయుడివి ఎక్కువ సీఎల్స్ ఉండటంతో ఎలా అనుమతిచ్చారని హెచ్‌ఎంను ప్రశ్నించారు. అలాగే పాఠశాల వరండాలో ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి..

పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో రాయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల పదోతరగతి విద్యార్థులతో ఆయన సమావేశమై మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున భవిష్యత్ ప్రణాళికను నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అదేవిధంగా పరీక్షలు రాసే సమయంలో పాటించాల్సిన పలు సూచనలను వివరించారు. సుమారు వంద మంది విద్యార్థులు గైర్హాజర్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి..

పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యతగా భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. భోజనం బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట సర్పంచ్ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఏసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య, పీఆర్ ఏఈ సత్తయ్య, ఎంపీఓ రఘురాములు ఉన్నారు.

ప్రిస్క్రిప్షన్ కంటి అద్దాల పంపిణీలో వేగం పెంచండి..

వనపర్తి: రెండోవిడత కంటివెలుగులో పంపిణీ చేయాల్సిన ప్రిస్క్రిప్షన్ అద్దాలను వెంటనే ఏఎన్ఎంలతో నేరుగా లబ్ధిదారుల చేతికి అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కంటివెలుగు, పోడు పట్టాల పంపిణీ, జీఓనంబర్ 58, 59 అమలు తదితర అంశాలపై సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్, అటవి, వైద్య, ఆరోగ్య, రెవెన్యూశాఖ అధికారులు వీసీలో పాల్గొన్నారు. అనంతరం పుర కమిషనర్లు, తహసీల్దార్లు, వైద్య, అటవీశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిబ్రవరి 26 నాటికి పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని, పోడు భూముల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జీఓనంబర్ 58, 59 భూ క్రమబద్ధీకరణ పత్రాల పంపిణీలో ఉన్న లోటుపాట్లను పూర్తిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రానున్న తెలంగాణకు హరితహారం కార్యాచరణ, నర్సరీల నిర్వహణ తదితర అంశాలపై పుర కమిషనర్లు దృష్టి సారించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కంటివెలుగు శిబిరాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కంటివెలుగు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు వేతనాలు అందేలా చూడాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అటవీశాఖ అధికారి రామకృష్ణ, డీటీడీఏ శ్రీనివాస్, పీఆర్ ఈఈ మల్లయ్య, డీఆర్‌డీఓ నర్సింహులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం

- వెంకటాంపల్లి పల్లెనిద్రలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంతో పాటు గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వెంకటాంపల్లిలో మంత్రి పల్లెనిద్ర చేశారు. మొదట ఇటీవల ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి, అన్నపూర్ణదేవి, సరస్వతిదేవి, శనేశ్వర స్వామి, జంటనాగులు, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు ఆలయం దగ్గర అందరికి ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, జిల్లా రైతు సంఘం కో–ఆర్డినేటర్ జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, సర్పంచ్‌లు వెంకటరమణ, దేవేందర్, సతీష్‌కుమార్, పీర్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, విక్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, జిల్లా గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్ బాగన్న, నాయకులు పురుషోత్తం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలే సురక్షితం

- డీఆర్‌డీఓ నర్సింహులు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న బ్యాంకర్లు, అధికారులు

వనపర్తి: ఆర్థిక అక్షరాస్యత సాధనే లక్ష్యంగా దేశవ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని డీఆర్‌డీఓ నర్సింహులు తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానం నుంచి ప్రధాన కూడళ్ల మీదుగా డిజిటల్ లావాదేవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అన్ని జాతీయ బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొనగా.. డీఆర్‌డీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2025 నాటికి దేశంలోని ప్రతి ఒక్కరికి డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలనే ధృడ సంకల్పంతో భారత రిజర్వ్‌బ్యాంకు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు కొనసాగుతున్నందున ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. 365 రోజులు 24 గంటలు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు డిజిటల్ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని.. పరిచయం లేని వారికి కార్డులు, మొబైల్స్, ఓటీపీలు చెప్పరాదని వివరించారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ అమూల్ పవార్, ఆయా బ్యాంకుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి ఎండీ జబ్బార్

పెద్దమందడి: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ధనికులకు కొమ్ము కాస్తూ పేదలను వంచించాలని చూస్తోందని విమర్శించారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న కామ్రేడ్ నర్సింహను నక్సలైట్లు బాంబు వేసి చంపారని.. ఆయన 32వ వర్ధంతి సభను ఈ నెల 21న మండల కేంద్రంలో నిర్వహించనున్నామని, సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మహబూబ్‌పాషా, రామచంద్రయ్యగౌడ్, మురళి, ఆశన్న, ఈశ్వర్, వెంకటయ్య, నిరంజన్, నవీన్ పాల్గొన్నారు.

జరిగిన ప్రగతిని వివరించాలి

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేయాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. గురువారం మండలంలోని కేతేపల్లిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు సంఘటితంగా పనిచేస్తూ కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాందాపూర్ సర్పంచ్ జయరాములుసాగర్, మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, గోవర్ధన్‌సాగర్, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న న్యాయమూర్తి రజని

వనపర్తి క్రైం: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి రజని హెచ్చరించారు. గురువారం జిల్లాకేంద్రంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. ప్రతి న్యాయస్థానంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉంటుందని.. మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడి విపత్తులకు గురైన వారికి ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని చెప్పారు. అలాగే వాహనాలు నడపమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంతోష్‌కుమార్, వెంకటేశ్, దయానంద్, నితిన్, రాఘవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి



నాగసానిపల్లిలో పాదయాత్ర చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి డా. చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి అన్నారు. గురువారం శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లి, వెంకటాపురం, జానంపేట, శేరుపల్లి, తాటిపాములలో హాథ్ సే హాథ్ జోడోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని.. అది ప్రజా ప్రభుత్వమేనన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని, వంటగ్యాస్ సిలిండర్ రూ.500కే అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం అందించనున్నట్లు వివరించారు. పలు గ్రామాల్లో గ్రామస్తులు సమస్యల వినతి పత్రాలు అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షుడు రాములు యాదవ్, ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, మండలపార్టీ గౌరవ అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఎంపీటీసీ ఎల్లస్వామి, విండో డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, నాయకులు చంద్రశేఖర్, శంకర్, ఆశన్న, పురుషోత్తం, రమేష్, ఎండీ ఉమర్, రోహిత్, ప్రవీణ్, అశోక్, శ్యాంసుందర్‌రెడ్డి, కురుమయ్య, రాజు పాల్గొన్నారు.

వినూత్నంగా..



ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలకు జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ సిద్ధమైంది. మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు వేరుశనగ, ఉలువలు, ఉప్పు వినియోగించి 25 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో కేసీఆర్ చిత్రపటాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. – వనపర్తి టౌన్

క్లుప్తంగా

నెలరోజులుగా లభించని ఆచూకీ

- కుమారుడి కోసం వెతుకుతున్న తల్లి



అజయ్‌కుమార్ రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: నెల రోజుల కిందట తప్పిపోయిన తన కుమారుడి ఆచూకి కోసం ఓ తల్లి ఒంటరిగా తిరుగుతోంది. పోలీసుల సాయం, బంధువుల ప్రోత్సాహం లేకపోయినా నిత్యం ఊర్లు తిరుగుతోంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం పెద్దాపూర్‌కి చెందిన అజయ్‌కుమార్ రెడ్డి 14 ఏళ్ల బాలుడు మహబూబ్‌నగర్ పట్టణంలోని మోనప్పగుట్టలోని జ్ఞాన భారతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే బాలుడు సక్రమంగా చదవడం లేదని తల్లి మందలించడంతో జనవరి 12న పాఠశాలలో ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. బాలుడు అదృశ్యంపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం ఇచ్చారు. కుమారుడి ఆచూకి కోసం తల్లి నెల రోజుల నుంచి మహబూబ్‌నగర్‌తో పాటు నారాయణపేట జిల్లాలోని అన్ని చోట్ల తిరుగుతోంది. ఈ విద్యార్థి కన్పిస్తే 9392967156 నంబర్‌కు ఫోన్ చేయండని వేడుకుంటుంది.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తకోట: మండలంలోని జాతీయ రహదారి వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముమ్మళ్లపల్లి జాతీయ రహదారిపై 40ఏళ్ల వయస్సు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అతని అక్కడికక్కడే మృతి చెందగా, వాహనాలు మృతదేహంపై వెళ్లడంతో రోడ్డుపై శరీరం ఛిద్రమైంది. మృతదేహాన్ని గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో స్థానికుల సమాచారంతో పోస్టుమార్టం నిమిత్తం వనపర్తికి తరలించారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిగా ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై లైంగికదాడి: కేసు నమోదు

భూత్పూర్: పట్టణంలోని బాలికపై లైంగికదాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన బాలిక స్థానిక పాఠశాలలో పదో చదువుతుండగా, పట్టణానికి చెందిన వ్యక్తి ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. 6 నెలల క్రితం బాలిక ఇంటి వద్దకు వచ్చి పెళ్లి చేసుకుంటానని తరుచూ చెప్పేవాడు. ఇదే క్రమంలో బుధవారం బాలిక తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటికి వచ్చి ప్రేమిస్తున్నానని, బయటకు వెళ్లి మాట్లాడుకుందామని చెప్పాడు. బాలికను ఆ వ్యక్తి అద్దె ఉంటున్న గది వద్దకు అదే రోజు సాయంత్రం తీసుకెళ్లాడు. బాలిక ఇంటికి వెళ్తానని చెప్పినా వినకుండా రాత్రి అత్యాచారం చేశాడని, గురువారం తెల్లవారుజామున ఇంటి వద్ద వదిలేసి వెళ్లాడు. రాత్రంతా ఎక్కడికి వెళ్లావని తల్లిదండ్రులు బాలికను నిలదీశారు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

వెల్దండ: మండలంలోని పల్గుతండాకు చెందిన నూనవత్ స్వరూపను రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచెడ్‌తండాకు చెందిన హన్మంతు ఏడు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. అదనపుకట్నం కోసం నాలుగు నెలలుగా వేధిస్తున్నాడు. దీంతో గురువారం భర్త, వారి కుటుంబ సభ్యులపై బాధితరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

యువతిని వేధిస్తున్న ఇద్దరిపై కేసు

మద్దూరు: యువతిని వేధిస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన కిర్రు కాశప్పకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన అదే గ్రామానికి చెందిన యువతిని లైంగికంగా కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో యువతికి పెళ్లి కుదిరింది. కిర్రు కాశప్ప, అతని మిత్రుడు మహేష్ కలిసి పెళ్లి సంబంధం చెడగొట్టారు. యువతి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని, కిర్రు కాశప్ప పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లబెల్లం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

అచ్చంపేట: మండలంలోని చెన్నారం, బల్మూర్ మండలం కొండనాగుల ప్రాంతాల్లో బుధవారం రాత్రి గాలిస్తుండగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ బాలరాజు తెలిపారు. 240 కిలోల నల్లబెల్లం, 50కిలోల పటిక, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.



నల్లమలలో శివనామస్మరణ



శ్రీశైలం ఘాట్‌రోడ్డు, కొండల్లో పాదయాత్ర చేస్తున్న భక్తులు



నల్లమల కొండల్లో నుంచి వస్తున్న భక్తులు



దోమలపెంట శివాలయంలో అన్నదానం

- అడవి గుండా శ్రీశైలం వెళ్తున్న శివమాలధారులు, భక్తులు
- దారిపొడవున అన్నదానాలు, వైద్య శిబిరాలు

అచ్చంపేట: శివనామస్మరణతో నల్లమల అభయారణ్యం మార్మోగుతుంది. శ్రీశైలేశుడి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, మాలాధారులు తరలివస్తున్నారు. కొందరు కాలినడకన శ్రీగిరి చేరకుంటున్నారు. మరికొందరు వాహనాల్లో వస్తున్నారు. ముందుగా పాతళగంగాలో పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. కైలాసనాథుడిని దర్శించుకుని ఇరుముడులు, మొక్కులు చెల్లించుకుంటున్నారు.

అంతా శివమయం..

అష్టాదశ మహాశక్తి పీఠాలలో ఒకటైన భ్రమరాంబ మహాశక్తి పీఠం స్వయంభుగా వెలసిన శ్రీశైలం కొండలపై కొలువు దీరిన మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. 18న శనివారం మహాశివరాత్రి కావడంతో భక్తులు ఇప్పటికే చేరుకున్నారు. వారం, పది రోజులుగా శ్రీశైలంలోని క్యూలైన్‌లన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. అచ్చంపేట నియోజకవర్గంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారితో పాటు మహబుబ్‌నగర్–శ్రీశైలం ప్రధాన రహదారి పూర్తిగా శివభక్తులతో నిండిపోయింది. రవాణా సౌకర్యాలు ఉన్నా దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో శివనామసంకీర్తనలు చేసుకుంటూ కాలినడకన కొండలు, గుట్టలు, బండరాళ్లను, ముళ్లకంపలను అడ్డు తొలగించుకుంటూ శ్రీశైలం చేరుకుంటున్నారు.

శ్రీశైలానికి 760 ప్రత్యేక బస్సులు

శ్రీశైలం బ్రహ్మోత్సవాలు, శివరాత్రి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాతో పాటు రంగారెడ్డి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. కాలినడకన వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణం కోసం జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఈనెల 17 నుంచి 19 వరకు 370, రంగారెడ్డి నుంచి 390 బస్సులను నడిపించనున్నారు. అచ్చంపేట డిపోలో శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రాజశేఖర్ తెలిపారు.

శిక్షణకు తరలిన రైతులు



శిక్షణకు వచ్చిన ఉమ్మడి జిల్లాల రైతులతో శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: పాలెం ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని రైతులు గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి నూనె గింజల పంటల కొత్త రకాలు, సాగు పద్ధతులపై శిక్షణకు గురువారం తరలివెళ్లారు. భారతీయ నూనె గింజల పంటల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర, తిమ్మాజిపేట మండల నుంచి గోరిట, చేగుంట, ఆవంచ, మహబుబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, భూత్పూర్ మండలాల నుంచి రైతులకు ఆముద, కుసుమ, వేరుశనగ, ఆవాలు, పొద్దు తిరుగుడు, నువ్వులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా నూనె గింజల పంటలలో కొత్త రకాలు, వాటి సాగు పద్ధతులను, యాజమాన్య పద్ధతుల్ని శాస్త్రవేత్తలు సురేష్, దురై మురుగన్ వివరించారు. శిక్షణలో శాస్త్రవేత్తలు నళిని, సదయ్య, ఈశ్వర్‌రెడ్డి, దివ్యరాణి, మయూరి, రావేఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్ష్యులను బెదిరించిన కేసులో ముగ్గురి రిమాండ్

- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ డి.స్వామిగౌడ్

మహబూబ్‌నగర్ క్రైం: వివాహిత ఆత్మహత్య కేసులో కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వచ్చిన తల్లి, కొడుకును బెదిరించిన ఘటనలో టూటౌన్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ డి.స్వామిగౌడ్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. మూసాపేట మండలం దాసరిపల్లికి చెందిన స్వప్నను 2003లో కావేరమ్మపేటకు చెందిన రాజుకు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఓ పాప జన్మించింది. కొన్నిరోజుల తర్వాత భర్త రాజు భార్య అయిన స్వప్నను అదనపు వరకట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధించడంతో 2021లో ఇంట్లో స్వప్న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై అప్పట్లో భర్త రాజు, అతని అక్క నాగమణి, ఆమె తమ్ముడు శేఖర్‌పై జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈకేసు ఈనెల 15న మహబూబ్‌నగర్ కోర్టులో విచారణకు రావడంతో మృతురాలి తల్లి నర్సమ్మ, అన్న గాండ్ల రవికుమార్ కలిసి కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వచ్చారు. కోర్టులో తల్లి, కొడుకు సాక్ష్యం చెప్పి బయటకు వస్తుంటే నేరస్థులు రాజు, నాగమణి, శేఖర్ వారిని అడ్డగించి మాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు మీ అంతు చూస్తామని, మీ ఇద్దరిని చంపుతామని బెదిరించారు. దీంతో గాండ్ల రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాజు, నాగమణి, శేఖర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

చెంచులకు మాత్రమే అనుమతి

మన్ననూర్: మహాశివరాత్రి రోజు నిర్వహించే భౌరాపూర్ ఉత్సవాలకు చెంచులకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు అటవీశాఖ మన్ననూర్ రేంజ్ అధికారి ఈశ్వర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు వచ్చే చెంచులు వన్యప్రాణి సంరక్షణ చట్టం పరిధిలోనే అనుసరించాల్సి ఉంటుందని తెలిపారు. శనివారం మాత్రమే ఉదయం 6 గంటల నుంచి అనుమతి ఇచ్చి అదే రోజు సాయంత్రం 6 గంటలకు తిరిగి వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అడవిలో సంచరిస్తున్న క్రమంలో మద్యం సేవించరాదని, సిగరేట్, బీడీ కాల్చరాదని ఆదేశాలిచ్చారు. ఎటువంటి ప్లాస్టిక్ వెంట తీసుకుని తీసుకురావద్దని, మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి మొదలుకొని భౌరాపూర్ వరకు వెళ్లే దారిలో వాహనాలను ఆపకూడదని, శబ్దాలు చేయరాదని హెచ్చరించారు.

జాతరకు వచ్చే వాహనాల ప్రవేశ రుసుము

ద్విచక్ర వాహనానికి రూ.40, ఆటోకు రూ. 300, ట్రాక్టర్ రూ.400, నాలుగు చక్రాల వాహనం రూ.500, ఆర్టీసీ బస్సులకు మినహాయింపు ఉందని తెలిపారు. జాతర ఏర్పాట్లను పరిశీలించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కళాజాతా, స్థానిక చెంచులు, మీడియా ప్రతినిధులకు మాత్రమే శుక్రవారం ప్రవేశం ఉంటుందని, ఇతరులు ఎవరికీ అనుమతి లేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- దర్గాను దర్శించుకుని వస్తుండగా కారు ఢీకొట్టడంతో అత్త, అల్లుడి మృతి
- మూసాపేటలో రైతును ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

పెబ్బేరు/అడ్డాకుల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వేగంగా దూసుకొచ్చిన ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అత్త, అల్లుడు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలపల్లికి చెందిన జయమ్మ(45) తన అల్లుడు మానవపాడుకు చెందిన బీచుపల్లి(34)తో కలిసి ద్విచక్రవాహనంపై వనపర్తి జిల్లాలోని ఓ దర్గాకు వచ్చి దర్శనం చేసుకొని తిరిగి స్వగ్రామాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రంగాపూర్ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయమ్మ, బీచుపల్లి అక్కడికక్కడే మృతిచెందారు. బీచుపల్లికి భార్య, కుమారుడు, కూతురు ఉండగా, జయమ్మకు కుమారుడు ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై జయమ్మ కుమారుడు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్‌రెడ్డి తెలిపారు.

మూసాపేటలో రైతు..

సైకిల్‌పై జాతీయ రహదారి దాటుతున్న ఓ రైతును ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. అడ్డాకుల మండలం కందూర్‌కు చెందిన సూగూరు కుమ్మరి రాములు(50) మూసాపేట మండలం సంకలమద్దికి చెందిన పార్వతమ్మను వివాహం చేసుకొని సంకలమద్దిలోనే నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా అందరి పెళ్లిళ్లు చేశాడు. రాములు వ్యవసాయంతో పాటు ఇతర కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం తెల్లవారుజామున సైకిల్‌పై పొలానికి బయలుదేరాడు. హనుమాన్ దాబా వద్ద జాతీయ రహదారి దాటుతుండగా అదే సమయంలో బెంగళూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.



సూగూరు కుమ్మరి రాములు(ఫైల్)

సీసీ పుటేజీ ఆధారంగా..

తెల్లవారుజామున 5.25 సమయంలో ప్రమాదం జరగడంతో రాములును ఢీకొట్టిన బస్సునంబర్‌ను గుర్తించలేకపోయారు. తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన చోట రహదారిపై సీసీ కెమెరాలు ఉండటంతో పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా బస్సునంబర్‌ను గుర్తించారు. బెంగళూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్ఎస్ ట్రావెల్స్‌దిగా గుర్తించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు చెప్పారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

దామరగిద్ద/మొయినాబాద్: ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న డ్రైవర్ అదే ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. వెనుకనుంచి అతివేగంతో వచ్చిన కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని పైనుంచి వెళ్లడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం గత్ప గ్రామానికి చెందిన కిందిగెరి రాములు(42) మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చాడు. పట్టణంలోని కిరణ్ వే బ్రిడ్జ్ నిర్వాహకుడు కృష్ణారెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం డస్ట్ లోడుతో ట్రాక్టర్‌ను మొయినాబాద్ నుంచి హిమాయత్‌నగర్ తీసుకెళ్తుండగా మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద వెనుకనుంచి అతివేగంతో వచ్చిన కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రాములు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని పైనుంచి దూసుకెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండేళ్ల క్రితం మృతుని కొడుకు వంశీ(4) సైతం ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతునికి భార్య పద్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రైతు ఆత్మహత్యాయత్నం

- ఎట్టకేలకు విరాసత్ చేసివ్వడంతో కథ సుఖాంతం
- నారాయణపేట జిల్లా మద్దూరులో ఘటన



తహసీల్దార్ కార్యాలయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న గోవిందు

మద్దూరు: కొన్నేళ్లుగా వారసత్వంగా వచ్చిన భూమిని విరాసత్ చేయడంలో అధికారులు అలసత్వంతోపాటు, భూమిపై కొంతమంది అభ్యంతరాలు చెబుతున్నారని ఓ రైతు తహసీల్దార్ కార్యలయంలోనే ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని రెనివట్లకు చెందిన భీమప్ప సర్వే నం.787లో 2 ఎకరాల భూమి ఉంది. అయితే భీమప్ప కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో ఎల్ఆర్‌యూపీలో సమస్యల వల్ల భీమప్ప బదులుగా భీమయ్య అనే పేరు పడింది. దీంతో అప్పటి నుంచి భీమప్ప భార్య కాశమ్మ విరాసత్ కోసం కార్యాలయం చుట్టు తిరిగింది. ఇందు కోసం తహసీల్దార్ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే ఈ సర్వే నంబర్లలో ఉన్న కొంతమంది రైతులు, కాశమ్మ దాయాదులు అభ్యంతరం చెబుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం కాశమ్మ తన కొడుకు గోవిందుతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఒంటిపై పెట్రోలు పోసుకోగా అక్కడున్న వారు నిలువరించారు. వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు భూమి పొజిషన్ పైకి వెళ్లి పరిశీలించారు. కాస్తులో కాశమ్మ కుటుంబ సభ్యులే ఉండటంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సహారాజ్ అహ్మద్ విరాసత్ చేసి పట్టా సర్టిఫికెట్‌ను కాశమ్మకు అందజేయడంతో కథ సుఖాంతమైంది.

ఐదో వసంతంలోకి 'పేట' జిల్లా



కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు (ఫైల్)

- ప్రగతి పరుగులు
- ప్రజలకు చేరువైన అధికార యంత్రాంగం

నారాయణపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా 2019 ఫిబ్రవరి 17న నారాయణపేట జిల్లాగా ఆవిర్భవించి శుక్రవారం నాలుగేళ్లు పూర్తి చేసుకొని ఐదో వసంతంలోకి అడుగిడుతుంది. జిల్లా 11 మండలాలు, 252 రెవెన్యూ గ్రామాలు, 280 జీపీలతో ఏర్పాటైంది. గతేడాది మరో రెండు మండలాలు పెరగడంతో జిల్లాలో 13 మండలాలకు చేరాయి.

ప్రజలకు సుపరిపాలన

జిల్లా ఏర్పాటు కావడంతో కలెక్టర్, ఎస్పీలతో పాటు వివిధ జిల్లా ప్రభుత్వ శాఖలకు అధికారులు ప్రజలకు అందుబాటులోకి రావడంతో సుపరిపాలన అందుతుంది. ప్రతి సోమవారం ప్రజావాణిలో సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టర్, ఎస్పీలను నేరుగా కలుస్తున్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత తొలి కలెక్టర్‌గా ఎస్.వెంకట్రావ్ బాధ్యతలను చేపట్టిన రెండు నెలల్లోనే ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్‌కు కార్యరూపం దాల్చడం, ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతిలో గ్రామాల్లో అభివృద్ధి బాట పట్టించారు. కలెక్టర్ వెంకట్రావ్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో దాసరి హరిచందన రెండో కలెక్టర్‌గా విధుల్లో చేరి రెండేళ్ల పాటు విధులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సైన్స్‌పార్కు, కళంకారీ నేత చీరలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఆమె ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడంతో ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష మూడవ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. అదేవిధంగా ఎస్పీగా ఉన్న చేతన బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ప్రస్తుతం ఎన్.వెంకటేశ్వర్లు విధులు నిర్వహిస్తున్నారు. లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్‌గా కె.చంద్రారెడ్డి విధులు నిర్వహించి బదిలీపై వెళ్లగా, ప్రసుత్తం మయాంక్ మిత్త విధులు నిర్వహిస్తున్నారు.



మండలాలతో నారాయణపేట జిల్లా ముఖచిత్రం

అట్టహాసంగా కార్యాలయాల ప్రారంభం

నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌ను ఫిబ్రవరి 17, 2019న అప్పటి ఇన్‌చార్జ్ కలెక్టర్ రొనాల్డ్‌రోస్, ఎస్పీ కార్యాలయాన్ని ఇన్‌చార్జ్ ఎస్పీ రెమారాజేశ్వరి, అప్పటి ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, ప్రస్తుత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు.

కలెక్టరేట్, ఎస్పీ భవనాలకు శంకుస్థాపన

జిల్లా ఏర్పాటై నాలుగేళ్లు పూర్తవుతున్న తరుణంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయానికి జనవరి 24న మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపనలు చేసి పునాదులు వేశారు.

ప్రగతి పరుగులు తీయిస్తున్న ప్రజాప్రతినిధులు

జిల్లా ఏర్పాటైన తర్వాత జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి తమ నియోజకవర్గాల్లో ప్రగతిలో పరుగులు తీయిస్తున్నారు.

నారాయణపేట జిల్లా స్వరూపం	
భూవిస్తీర్ణం	2,33,689 హెక్టర్లు
గ్రామ పంచాయతీలు	280
రెవెన్యూ గ్రామాలు	252
నియోజకవర్గాలు	మక్తల్, నారాయణ, కొడంగల్
సాగు విస్తీర్ణం	1,67,911 హెక్టర్లు
సాగు చేస్తున్నది	1,64,055 హెక్టర్లు
అటవీ ప్రాంతం	4,039 హెక్టర్లు
కుటుంబాలు	1,10,877
జనాభా	5,66,874
పురుషులు	2,82,231
మహిళలు	2,84,643
ప్రాజెక్టులు	సంగంబండ, భూత్పూర్, కోయిల్‌సాగర్
లిఫ్ట్ ఇరిగేషన్‌లు	తంగిడి, కుసుమూర్తి, పస్పుల
పాఠశాలలు	680
జూనియర్ కళాశాలలు	72

నాలుగేళ్లకే.. నూరేళ్లు

- సంపులో పడి చిన్నారి మృతి



అక్షయ (ఫైల్)

మదనాపురం: కుటుంబమంతా శుభకార్యానికి వెళ్లే హడావుడిలో ఉన్నారు. అప్పటి వరకు తోటి పిల్లలతో ఆడుకుంటున్న చిన్నారిని తల్లి కొత్త వస్త్రాలు వేయించి సిద్ధం చేసింది. తోటి పిల్లలతో ఆడుకునేందుకు బయటకు వెళ్లి ఇంటి ముందున్న నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం కలకలం రేపింది. వడ్డె సిద్దు, పార్వతమ్మ దంపతులకు మూడవ సంతానం అక్షయ (4), తోటి బంధువులతో కలిసి శుభకార్యానికి వెళ్లేందుకు అందరూ సిద్ధమయ్యారు. తమ చిన్నారి అక్షయ కనిపించకపోవడంతో చుట్టూ ఉన్న ఇళ్లను వెతికారు. ఎక్కడా లేకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి ముందున్న నీటి సంపులో చూశారు. అడుగు బాగంలో పడి నిర్జీవంలో కనిపించింది. క్షణాల్లో బయటకు తీసేసరికి మృతి చెందింది. కుటుంబమంతా బోరుమన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

క్లుప్తంగా

వరి పంటల పరిశీలన



పెబ్బేరు: మండలంలోని రామమ్మపేట శివారులో సాగు చేసిన వరి పంటలను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రమౌళి మాట్లాడుతూ యాసంగిలో వరి పంటలో తెగుళ్లు ఆశిస్తున్నాయని తెలిపారు. రైతులు తెగుళ్లపై పలు జాగత్తలు తీసుకోవాలని, అలాగే వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువ ఉందని పేర్కొన్నారు. వీటి నివారణకు ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్, జింకు లోప నివారణ ఎకరాకు 250 గ్రాముల చీలమిన్ జింకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి అంజనేయులు, రైతులు రంజిత్‌కుమార్‌రెడ్డి, చిన్నయ్య, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చేపడుతున్న మరమ్మతు పనులను నిబంధనలకు అనుగుణంగా నాణ్యతగా చేపట్టాలని పీఆర్ ఏఈ సత్తయ్య అన్నారు. గురువారం పీహెచ్‌సీలోని స్లాబ్‌పై ఫ్లోరింగ్, విద్యుత్, పైపు లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఆయా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుకు నిప్పు



అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలోని డంపింగ్‌యార్డులో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకున్న సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టణ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందున్న డంపింగ్‌యార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పురపాలిక కమిషనర్ మహ్మద్‌ఖాజ అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎదురుగా విద్యుత్ సబ్‌స్టేషన్, పక్కన చేనేత సహకార భవనం ఉండడంతో పెను ప్రమాదమే తప్పిందని, మంటలు చెలరేగి ఉంటే భారీ నష్టం వాటిల్లేదని పలువురు పేర్కొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఖిల్లాఘనపురం: స్థానిక ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీహరిని గురువారం బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మొల్గర తిరుమలేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు రమేష్, మన్నెం తదితరులు పాల్గొన్నారు.

పథకాలు కేంద్రానివి.. ప్రచారం రాష్ట్రానిది..



ఆత్మకూర్/అమరచింత: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు దిగజారి ప్రచారం చేసుకుంటున్నారని హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చంద్ర, జిల్లా ఇంచార్జ్ బోసుపల్లి ప్రతాప్ ఎద్దేవా చేశారు. గురువారం రాత్రి ఆత్మకూర్, అమరచింత మండలాల పరిధిలోని పాంరెడ్డిపల్లిలో ప్రజాఘోష బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ పాలన అవినీతిమయమని, అబద్దాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, ప్రజలందరూ ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అశ్విన్‌కుమార్, మేర్వరాజు, వెంకటేశ్వర్లు, రేచింత శ్రీను, మరాఠి అశోక్, క్యామ భాస్కర్, తమ్మలి విజయ్, అశోక్, డాక్టర్ విజయ్ కుమార్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రాము, రవి, జగన్నాథం, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం.. బకాయిల భారం!

- భోజనం బిల్లులు రూ. 9.35 లక్షలు, గుడ్డు బిల్లు రూ.4.31లక్షలు
- ఇబ్బందుల్లో నిర్వాహకులు



పాన్‌గల్‌లో వంట చేస్తున్న నిర్వాహకురాలు

పాన్‌గల్: సర్కార్ బడుల్లో పిల్లల హాజరు శాతం పెంపు, వారికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తోంది. స్వయం సహాయ సంఘాల సభ్యులు, తదితరులతో వంట చేయిస్తూ విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. కొన్నేళ్లుగా వీరికి నెలకు రూ.వెయ్యి గౌరవ వేతనం అందించిన ప్రభుత్వం ఇటీవల రూ. 3 వేలకు పెంచుతూ జీఓ జారీ చేసింది. వేతనం పెరిగిందన్న ఆనందం ఉన్నా.. బిల్లులు సకాలంలో విడుదల కాక నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే బిల్లులు నెలనెల రెగ్యూలర్‌గా అందకపోవడంతో సరుకులు తీసుకోవడం ఇబ్బందిగా మారి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వంట నిర్వాహకులు వాపోతున్నారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 పంచాయతీల్లో 37 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 5,091 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 79 మంది మహిళలు వంట చేస్తున్నారు. 1 నుంచి 8 తరగతులకు సంబంధించినవి డిసెంబర్, జనవరి వరకు, 9 నుంచి 10 తరగతులకు చెందిన బకాయిలు అక్టోబర్ నుంచి జనవరి వరకు పెండింగ్‌లో ఉన్నాయి. భోజనం బిల్లులు, గుడ్డు బిల్లులు కలిపి సుమారుగా రూ.14 లక్షలకు పైగా పేరుకుపోయాయి. రెండు నెలలుగా నిర్వాహకులకు వేతనాలు అందట్లేదు. సంబంధిత అధికారులు ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని తమ ఆర్థిక కష్టాలు తీర్చాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లుల వివరాలు (సుమారు రూ.లక్షల్లో)

తరగతి	గుడ్డు	రావాల్సినవి
1-8	1.22	6.25
9-10	3.09	3.08

నిర్వాహకులు 79 మందికి
పెండింగ్ వేతనాలు: రూ. 1.58 లక్షలు

తరగతుల వారీగా ఒక్కొక్క విద్యార్థికి చెల్లించాల్సిన చార్జీలు (రూ.లలో)

తరగతి	1-5	6-8	9-10
రోజుకు	5.45	8.17	10.67

అప్పులు చేస్తున్నాం



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బిల్లులు నెలనెలా అందక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులు చెబుతున్నా బిల్లుల మంజూరులో మాత్రం జాప్యం జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బిల్లుల జాప్యంతో వంట చేయలేమని ఉపాధ్యాయులకు చెబుతున్నా.. వారి సూచన మేరకు తప్పని పరిస్థితుల్లో వంటలు చేస్తున్నాం. – అలివేల, వంట నిర్వాహకురాలు, పాన్‌గల్

జాప్యం లేకుండా చెల్లించాలి



ప్రభుత్వ పాఠశాల్లో వంట నిర్వాహకులకు అందించే భోజనం బిల్లులు జాప్యం లేకుండా చెల్లిస్తే వారి ఇబ్బందులు తొలుగుతాయి. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు వంటలు చేసేందుకు అప్పులు చేస్తూ ఇబ్బందుల పాలవుతున్నారు. అలాగే వారికి పెరిగిన గౌరవ వేతనం వెంటనే అమలు చేయాలి. – బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

ఖాతాల్లో జమచేస్తాం



మండలంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే నిర్వాహకుల ఖాతాల్లో జమచేస్తాం. మండలంలో రూ.14 లక్షలకు పైగా పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. మరో మారు ఆయా వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకవెళ్లి సకాలంలో మంజూరు అయ్యేలా తగు చర్యలు తీసుకుంటాం. – లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

మంత్రికి ఆహ్వానం



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో మార్చి 7న నిర్వహించే రంగనాయకస్వామి జాతరకు రావాలని గురువారం శ్రీరంగాపురం సేవా సమితి ఆధ్వర్యంలో హైదారాబాద్ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా శ్రీరంగాపురం సేవా సమితికి స్థలం కేటాయించాలని మంత్రిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రఘునందన్‌రావు, ఉపాధ్యక్షులు నరేందర్, కార్యదర్శి నగేష్‌బాబు, కోశాధికారి జగదీశ్వర్‌గౌడ్, గోపాల్, రాజు, రఘు, సుకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం ఆక్రమణపై వాగ్వాదం

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి విష్ణుకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. కొంతమంది వ్యక్తులు శ్మశాన వాటికలు ఆక్రమించుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సురేష్, బాలస్వామి, శ్రీను, బుచ్చన్నగౌడ్ కోరారు. ఈ విషయంలో కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. కావున అధికారులు స్పందించి అక్రమాలకు గురికాకుండ చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నదానానికి విరాళం అందజేస్తున్న తిరుపతమ్మ, కృష్ణయ్యగౌడ్ దంపతులు



పాన్‌గల్‌లో..

వీపనగండ్ల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన సోమశిలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి మండలంలోని సంగినేనిపల్లికి చెందిన రాష్ట మహిళా కాంగ్రెస్ కార్యదర్శి కాటమోని తిరుపతమ్మ, కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. సోమశిల దేవస్థానానికి వచ్చిన భక్తులకు పూర్తి స్థాయిలో అన్నదానం చేసేందుకు ఈ విరాళాన్ని ప్రకటిస్తున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అన్వేష్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు మౌలాలీ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి..

పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి విరాళాలు వెల్లువెత్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన కొత్త బాలక్రిష్టారెడ్డి జ్ఞాపకార్థం వారి మనువడు కొత్త రాఘవేందర్‌రెడ్డి (ఎన్ఆర్ఐ) రూ. 2 లక్షలు, పెద్దబోయిని మహేష్ (ఆర్టీసీ డ్రైవర్) రూ. 10,116 ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చి విరాళాలు అందజేసిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వనాథ తపోవనంలో ప్రత్యేక పూజలు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో కాశీ విశ్వనాథ తపోవన ఆశ్రమంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అన్నదాన సత్రానికి బియ్యం అందజేత

ఆత్మకూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలోని అన్నదాన సత్రానికి ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని గురువారం విరాళంగా అందించారు. శ్రీశైలంలోని ఆరెకటిక అన్నదాన క్షేత్రంలో నిర్వహించే అన్నదానంలో భాగం పంచుకోవాలనే సదుద్దేశంతో ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా బియ్యం పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దశరథ్, తులసీరాం, నర్సింగ్, సౌజన్యగంగాధర్, సురేష్, శ్రీనివాస్, హన్స్ రాజ్, శాంతరాం, ప్రసాద్, రాజేందర్, నారాయణ, లింగరాం, రాజేష్ ఉన్నారు.

రద్దయిన బస్సును పునరుద్ధరించాలి

వీపనగండ్ల: కొల్లాపూర్ డిపో అధికారులు జటప్రోలు, సంగినేనిపల్లి, వల్లభాపూర్ గ్రామాల మీదుగా హైదరాబాద్‌కు నడుపుతున్న బస్సును ఇటీవల రద్దు చేశారని, ఆ బస్సును తిరిగి పునరుద్ధరించాలని వల్లభాపురం, సంగినేనిపల్లి గ్రామాల సర్పంచ్‌లు రాగుల రవీందర్‌రెడ్డి, మౌలాలీ గురువారం కొల్లాపూర్ డిపో మేనేజర్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. పెంట్లవెల్లి, వీపనగండ్ల, పాన్‌గల్ మండలాల్లోని పలు గ్రామాల ప్రజలకు ఉదయం వేళల్లో హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనువుగా ఉన్న ఈ బస్సును వెంటనే ప్రారంభించాలని వారు కోరారు.

వృద్ధురాలు అదృశ్యం

వనపర్తి క్రైం: కొడుకు కోపంతో అన్న మాటకు ఇంటి నుంచి వెళ్లిన ఓ తల్లి అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన శివకుమార్ తన తల్లి అన్నపూర్ణమ్మకు కల్లు తాగే అలవాటుందని, మానుకోమ్మని చెప్పడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 11న బయటికి వెళ్లిందని తెలిపారు. ఆమె ఇంత వరకు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. దీంతో గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఎత్తు 5 అంగులాలు, చామన చాయ రంగు కలదని.. ఎవరికైనా కనిపిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

‘జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి’



తహసీల్దార్ రాజేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వనపర్తి క్రైం: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ గురువారం అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు తహసీల్దార్ రాజేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని జిల్లా అధికార యంత్రాంగం ముందుకు సాగుతున్న తరుణంలో కొందరు నాయకులు మాత్రం రాజకీయాలు చేస్తున్నారని, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో రాజకీయం తగదని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి జర్నలిస్టులకు త్వరగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో సతీష్, వెంకటేష్, రాములు, రమేష్ తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణ కోసమే ‘కంటివెలుగు’



జానంపేటలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని 5 వార్డులో కౌన్సిలర్ పోషన్న ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, వైద్యులు నిస్సార్‌అహ్మద్, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

423 మందికి..

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి, బహుదూర్ గూడెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 423 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్, వెంకట్రాములుయాదవ్ పాల్గొన్నారు.

167 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని జానంపేట పంచాయతీ కార్యాలయంలో 167 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్ , ప్రియాంక , సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్త సంగీత పాల్గొన్నారు.

280 మందికి..

ఖిల్లాఘనపురం: మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిధిలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మొత్తం 280 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బుల్ పాష, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొంటాం



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

అమరచింత: అధికారం అండతో బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు కార్యకర్తలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటిశ్రీహరి, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, టీపీసీసీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, కత్తెపల్లి విష్ణువర్ధన్‌రెడి, రాష్ట్ర యూత్ కార్యదర్శి రాంసింగ్‌నాయక్ అన్నారు. గురువారం అమరచింత మున్సిపాలిటీలోని కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసీరాజ్ ఆధ్వర్యంలో యూత్‌జోడో బూత్‌జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్వ, ఆత్మకూర్, అమరచింత మండలాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. యువతతోనే మార్పు సాధ్యమని, ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై ఒత్తిడి

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పార్టీలు మారాలంటూ బెదిరింపులకు పాల్పడే బీఆర్ఎస్, బీజేపీలకు గట్టి సమాధానం చెబుతామన్నారు. అవినీతి పాలన కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వచ్చేఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి దేశాన్ని బీజేపీ, బీఆర్ఎస్ కబంధ హస్తాల నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలోనే రేవంత్‌రెడ్డి పయనిస్తున్నారని, వైఎస్ఆర్ లాంటి సుపరిపాలనను అందించే విధంగా కార్యాచరణతో ముందుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మహంకాళి విష్ణు, జుబేర్, పరమేష్, చెన్నయ్య, అరుణ్‌కుమార్, నల్గొండ శ్రీను, రహ్మతుల్లా, శ్యాంకుమార్, మహేందర్‌రెడ్డి, ప్రకాషం, నాగునాయక్, గంగాధర్, తౌఫిక్, పోషిగారి విష్ణు, కృష్ణారెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్యామ్

అమరచింత మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్యాంకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, యువతను పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేర్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వనపర్తి టౌన్: సరైన ఆహారం, ఆలోచన, అవగాహనతోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలరని చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస పరీక్షల సన్నాహ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని రచన టైమ్స్ నేచర్ అండ్ కల్చర్ చేయూత, కౌన్సిలింగ్, శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉత్తమ విద్యా సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాజేశ్వర్‌రావు, లెక్చరర్లు రాజేందర్ రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బుద్దారం గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ తెలంగాణ అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్టీయూ, టీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, గజిటెడ్ పధానోపాధ్యాయుల సంఘం వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌కుమార్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని సోళీపురం, మానాజీపేట, ఖిల్లాఘనపురం బాలుర, బాలికల, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, తెలంగాణ మోడల్ పాఠశాల, తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో వారు పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, షఫీ, కిరణ్, నవీన్‌కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అమరేందర్‌రెడ్డి కోరారు. గురువారం వారు ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ, కేజీబీవీలు, ప్రాథమిక, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు తిరిగి ఏవీఎన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, కేశవులు, బాలీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓంశాంతి పార్కు నిర్మాణానికి భూమిపూజ

కొల్లాపూర్: శాంతియుత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని 7వ వార్డులో గల మున్సిపల్ స్థలంలో బ్రహ్మకుమారీ సమాజం ఆధ్వర్యంలో నిర్మించనున్న ఓం శాంతి పార్కుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం బ్రహ్మకుమారీ సమాజం ఎంతో కృషిచేస్తోందని వివరించారు. ఓం శాంతి పార్కులో ప్రజలు ధ్యానం చేసుకోవడంతో పాటు, ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. బ్రహ్మకుమారీలు ధ్యానం యొక్క విశిష్టతను తెలియజేస్తూ నైతిక విలువలను పెంచేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అంతకు ముందు మీ కోసం మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి 7వ వార్డులో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



రామమ్మపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ జయరాములు



కల్వరాలలో..

వీపనగండ్ల: విద్యలో రాణించలేని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు కల్వరాల ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ కతలప్పతో కలిసి ఆయన సందర్శించారు. గణిత సామర్థ్యాల్లో నాల్గో తరగతి విద్యార్థులకు విద్యాబోధన తీరును వారు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా వసతులను ఏర్పాటు చేస్తున్నందున తల్లిదండ్రులు తమ విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మన ఊరు మన బడి నిధుల ద్వారా నిర్మిస్తున్న అదనపు గదుల పనులను నాణ్యతగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సుజాత, నాగేశ్వరమ్మ, సత్యనారాయణ, శిరీష, స్వప్న, రాధ, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: మండలంలోని కిష్టారెడ్డిపేట, రామమ్మపేట గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి జయరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లస్ ప్రోగ్రాం అమలు తీరును, విద్యార్థుల సామర్థ్యాలను, రికార్డులు, హాజరుతో పాటు విద్యార్థుల నోట్‌బుక్‌లను పరిశీలించారు. అలాగే మార్చి వరకు విద్యార్థుల తరగతికి తగిన సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...


కల్వకుర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం తిని పదిమందికి అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో ఐదుగురు విద్యార్థులు ఆస్పత్రిలో చేరిక

కల్వకుర్తి రూరల్: పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనం తిని 10 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. పాఠశాలలో గురువారం వండిన భోజనం సరిగ్గా ఉడకకపోవడంతో పాటు వాసన వచ్చింది. దీంతో భోజనం తిన్న విద్యార్థుల్లో 10 మంది వాంతులు చేసుకోవడంతో పాటు తలనొప్పితో బాధపడ్డారు. వీరిలో ఐదుగురు రాకేష్, గణేష్, సురేందర్, యశ్వంత్, సూర్యతేజలకు వాంతులు ఎక్కువ కావడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కొన్నిరోజులుగా మహిళలకు బదులుగా వారి భర్తలు మధ్యాహ్న భోజనం వండుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. హెచ్‌ఎం కస్నానాయక్ ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

తల్వార్‌తో కేక్ కట్ చేసిన మంత్రి



నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బర్త్‌డే వేడుకలకు ఓ నేత తల్వార్‌తో వచ్చారు. మంత్రికి తల్వార్‌ను ఇచ్చి కేక్ కట్ చేయాలని చెప్పారు. దీంతో ఇంద్రకరణ్‌రెడ్డి తల్వార్‌తో కేక్ కట్‌చేసి నేతలకు తినిపించారు. ఈ వేడుకలకు నిజామాబాద్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, నిజామాబాద్ మున్సిపల్ మేయర్, వారి అనుచరులు వచ్చారు. తల్వార్ పోలీసుల అనుమతితోనే క్యాంపు కార్యాలయంలోకి వచ్చిందా లేక పోలీసుల కళ్లుగప్పి తెచ్చారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్


వేములవాడ: మహాశివరాత్రి సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. నేటి నుంచి ఆలయంలో శివరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి.

ఒక్క డాక్యుమెంట్ రూ.15.96 కోట్లు!

రిజిస్ట్రేషన్ల శాఖకు గండిపేట పరిధిలో 'గోల్డెన్'డీల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు 'గోల్డెన్'డీల్స్ వస్తున్నాయి. 2023 సంవత్సరం ప్రారంభంలోనే మంచి బోణీ అందింది. జనవరి తొలివారంలో ఒకే ఒక్క డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌తో ఏకంగా రూ.15.96 కోట్ల ఆదాయం సమకూరింది. గండిపేట సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బండ్లగూడ జాగీర్‌లో ఉన్న 75,072 చదరపు గజాల భూమిని మైనార్టీ ట్రస్టు నుంచి మరో ఎడ్యుకేషనల్ ట్రస్టుకు బదలాయిస్తూ (కన్వేయన్స్) ఈ లావాదేవీ జరిగింది. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ భూమి మొత్తం మార్కెట్ విలువను రూ.210 కోట్లుగా లెక్కించి, రూ.15.96 కోట్ల ఫీజు వసూలు చేశారు.

ఇంతకు ముందు ఇంకా పెద్ద డీల్

2022 మేలో ఒకే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ద్వారా ఏకంగా రూ.35.51 కోట్ల ఆదాయం సమకూరింది. కూకట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి వచ్చే మిస్కిపేటలో 1,54,880 చదరపు గజాల భూమిని ఓ ఆయిల్ కార్పొరేషన్, ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కలిసి మరో రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించాయి. ఈ భూమి మార్కెట్ విలువ రూ.466 కోట్లుగా నిర్ధారించిన రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు 35.51 కోట్ల ఫీజు వసూలు చేశారు. ఇక గండిపేట, రాజేంద్రనగర్, వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కేవలం 5 డాక్యుమెంట్ల ద్వారానే రూ.100 కోట్లకుపైగా రెవెన్యూ సమకూరిందని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.14,500 కోట్లదాకా ఆదాయం!

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పరిశీలిస్తే.. ఫిబ్రవరి 13 నాటికి రూ.12,310 కోట్ల వరకు ఖజానాకు చేరినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మరో నెలన్నర రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో.. ఇంకో రూ.2,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్ల వరకు వస్తాయని అంచనా వేస్తున్నా రు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లన్నీ కలిపి రూ.14,500 కోట్లు సమకూరవచ్చని అంటున్నారు.

2022-23లో భారీగా ఫీజు వచ్చిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు (రూ.కోట్లలో)

నెల	రిజిస్ట్రార్ ఆఫీసు	రెవెన్యూ
మే (2022)	కూకట్‌పల్లి	35.51
ఏప్రిల్ (2022)	గండిపేట	21.72
ఆగస్టు (2022)	గండిపేట	16.21
జనవరి (2023)	గండిపేట	15.96
అక్టోబర్ (2022)	రాజేంద్రనగర్	15.08
ఏప్రిల్ (2022)	వనస్థలిపురం	14.43
సెప్టెంబర్(2022)	కూకట్‌పల్లి	13.58

పురుగు మందు మితిమీరుతోంది!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నాయి. నేల సారం దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుందని, దిగుబడుల్లో పురుగు మందుల అవశేషాలు ఆరోగ్యానికి హానికరంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరోవైపు పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో రైతులు, దిగుబడులను సేకరించే సమయంలో కూలీలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నట్లు పరిశీలనలు చెబుతున్నాయి.

పీఎం ప్రమాణ్‌పై ఆసక్తి చూపని ప్రభుత్వాలు

పురుగుమందుల వాడకానికి సంబంధించిన అధ్యయనాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. పెస్టిసైడ్స్ వినియోగాన్ని తగ్గించి సహజ సిద్ధమైన సాగు విధానాలను ప్రవేశ పెట్టే క్రమంలో పీఎం ప్రమాణ్ (ప్రధాన మంత్రి ప్రమోషన్ ఆఫ్ ఆల్టర్నేట్ న్యూట్రియంట్స్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్) పేరుతో ప్రత్యామ్నాయ పోషకాలను ప్రోత్సహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ ఈ పథకంపై రైతాంగానికి అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదని ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు ఓ సమావేశంలో అభిప్రాయపడ్డారు. సహజ సిద్ధమైన విధానాలు అవలంబిస్తే భూసారాన్ని పరిరక్షించవచ్చని, సాగు ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి పెరుగుతుందనేది అపోహే..

వ్యవసాయంలో రసాయన మందుల వినియోగం పెంచడం వల్ల దిగుబడి పెరుగుతుందనేది ఒక అపోహ మాత్రమే. ఒక్కోసారి సీజన్‌లోని వాతావరణ పరిస్థితులతో దిగుబడి పెరిగినా.. క్రిమిసంహారకాల వినియోగం పెంచడంతో క్రమంగా దిగుబడి తగ్గుతుంది. ఇటీవలి కాలంలో రైతులు తరచుగా జ్వరం, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలకు గురవుతున్నారు. పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా గాలిద్వారా రసాయనాలు కొంతమేరకు శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. శరీరంపై పడిన రసాయనాల వల్ల చర్మ సంబంధిత వ్యాధులు బాధిస్తాయి. పలు అంతర్జాతీయ సంస్థలు ఈ అంశాలపై పరిశోధనలు జరిపి ధ్రువీకరించాయి. మరోవైపు రసాయనాలతో కూడిన మందుల వినియోగంతో భూసారం తగ్గితే, ఎరువుల వాడకాన్ని కూడా పెంచాల్సి వస్తుంది. ఇది రైతుకు అదనపు భారంగా మారుతుంది. అందువల్ల సహజసిద్ధమైన పద్ధతుల్లో సాగు చేయడమే మేలు. దిగుబడి ఒకేసారి పెరగనప్పటికీ, భవిష్యత్తులో లాభదాయకంగా ఉంటుంది.
– నర్సింహారెడ్డి, వ్యవసాయ రంగ నిపుణులు

క్రిమిసంహారకాలు అత్యధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలు (మె. టన్నుల్లో)

రాష్ట్రం	2017-18	2018-19	2019-20	2020-21
మహారాష్ట్ర	15,568	11,746	12,783	13,243
ఉత్తర్‌ప్రదేశ్	10,824	11,049	12,217	11,557
పంజాబ్	5,835	5,543	4,995	5,193
తెలంగాణ	4,866	4,894	4,915	4,986
హరియాణా	4,025	4,015	4,200	4,050
జాతీయ స్థాయి	63,406	59,670	61,702	62,193

ఆటోను ఢీకొట్టిన బస్సు

నలుగురు మహిళలు దుర్మరణం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతులు.. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో పనిచేసే కార్మికులు
- ప్రమాదానికి కారణమైన బస్సు కూడా కంపెనీదే..


ఆటోను ఢీకొట్టిన బస్సు


అనసూయ(ఫైల్)


నాగలక్ష్మి(ఫైల్)


శిరీష (ఫైల్)


ధనలక్ష్మి(ఫైల్)

చౌటుప్పల్: ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి నాలుగు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. సరైన సమయంలో బ్రేకులు పడకపోవడంతో జరిగిన ప్రమాదంలో నిరుపేద కుటుంబాలకు చెందిన నలుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో గురువారం చోటుచేసుకుంది. ఇండస్ట్రియల్ పార్కులో శ్వేత తెలుగు ఫుడ్స్ (పచ్చళ్ల కంపెనీ)లో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పనిచేస్తున్నారు. దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రోజూ మాదిరిగానే ఉదయం 8.30కి ఆటోలో కంపెనీకి బయలుదేరారు. ఇదే కంపెనీలో పనిచేసేందుకు రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కార్మికులు కంపెనీకి చెందిన అద్దె బస్సుల్లో వస్తారు. ఆ క్రమంలో కార్మికులతో వస్తున్న బస్సు ఇండస్ట్రియల్ పార్కు తూర్పు వైపున ఉన్న రోడ్డులో వస్తోంది. బస్సు వస్తున్న రోడ్డు ఏటవాలుగా ఉండడంతో డ్రైవర్ బస్సు గేరును న్యూట్రల్ చేశాడు. సరిగ్గా అదే సమయంలో మహిళా కార్మికులతో వస్తున్న ఆటో కంపెనీలోకి వెళ్లేందుకు కుడివైపునకు తిరుగుతుండగా బస్సు బలంగా వచ్చి ఢీకొట్టింది. బస్సును ఆపేందుకు దాని డ్రైవర్ ప్రయత్నించినప్పటికీ గేరు న్యూట్రల్‌లో ఉన్న కారణంగా ఆగకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దాకోజి నాగలక్ష్మి(28), వరకాంతం అనసూయ(55), సిలివేరు ధనలక్ష్మి(35), దేవరపల్లి శిరీష(30) మృతిచెందారు. ఆటోడ్రైవర్ కొండ వెంకటేష్ తో పాటు మరో ముగ్గురు మహిళలు చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. నలుగురు మృతి చెందడంతో దేవలమ్మనాగారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామస్తులు పచ్చళ్ల కంపెనీ ముందు ఆందోళనకు దిగారు. శిరీష మృతదేహాన్ని కంపెనీ ముందు ఉంచి ఆందోళన చేశారు.

అదృశ్యమై... ఆపై శవాలై

- ప్రేమికుల దినోత్సవం ముందు రోజే వెళ్లారు..
- మరణంలో సైతం ఒక్కటేనన్నట్టు చేతులు కట్టుకొని చెరువులో దూకారు


కల్పన (ఫైల్)


ఖదీర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మూడు రోజులుగా కనిపించకుండా పోయిన ఆ జంట అదృశ్యం మిస్టరీ విషాదాంతమైంది. వారి మృతదేహాలు గురువారం నార్సింగిని ఆనుకునే ఉన్న క్యాసంపల్లి చెరువులో లభ్యమయ్యాయి. మరణంలోనూ తమను విడదీయలేరనే భావంతో వివాహిత చున్నీతో ఇద్దరూ తమ చేతులను కట్టుకొని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తోట సిద్దరాములు చిన్న కూతురు తోట కల్పన (18) పదో తరగతి వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఖలీల్ (19) కల్పన పెద్దనాన్న వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న క్రమంలో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ క్రమంలో పలుమార్లు గొడవలు జరగగా ఖలీల్‌ను పనిలోంచి తీసేశారు. మూడు నెలల క్రితం కల్పన వివాహం కామారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన వ్యక్తితో జరిగింది. పెళ్లయినా ఖలీల్‌తో సాన్నిహిత్యం కొనసాగేది. కల్పన గత సోమవారం పుట్టింటికి వచ్చింది. కల్పన అదేరోజు రాత్రి బస్సులో రామాయంపేటకు రాగా, ఖలీల్ బైక్‌పై వచ్చాడు. ఇద్దరూ కలిసి నార్సింగికి చేరుకున్నారు. చెరువువద్ద బైక్‌తోపాటు చెప్పులు విడిచి కల్పన చున్నీతో ఇద్దరి చేతులు కట్టుకొని నీటిలో దూకినట్టు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం ఇద్దరి మృతదేహాలు నీటిలో తేలగా, చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరి మృతదేహాలను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కంపెనీకి కోయిల్‌సాగర్ నీటినే తరలిస్తుండ్రు



మరికల్: ఇథనాల్ కంపెనీ యాజమాన్యం జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీటిని దోచుకెళ్తున్నారని పాలమూరు అధ్యయన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు, కంపెనీ వ్యతిరేక పోరాట నాయకులు మురళి, మణివర్ధన్‌రెడ్డి అన్నారు. 6వ రోజు గురువారం కిష్టాపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర గోటూర్, కోండ్రోనిపల్లి, పూసల్‌పహాడ్, రాకొండ, రాత్రికి లాల్‌కోట క్రాసింగ్ దగ్గరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం దశాబ్దాల నుంచి కోయిల్‌సాగర్ నీళ్లపై ఆధారపడిందని, ఇక్కడి రైతులపై ఇథనాల్ కంపెనీ ఏర్పాటు ముప్పుగా మారిందన్నారు. జూరాల నుంచి కోయిల్‌సాగర్ వచ్చే 2టీఎంసీల నీరులో ఒక టీంఎసీ నీటిని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వాడుకునేందుకు పైపులైన్ పనులు చేపట్టారన్నారు. కంపెనీకి నీళ్లు వెళితే ప్రాజెక్టు ఆయకట్టు ఎడారిగా మారి పంటలు పండని పరిస్థితి వస్తుందన్నారు. పైపులైన్ పనులను అడ్డుకునేందుకు ఇక్కడి రైతులు తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు ముప్పుగా మారిన కంపెనీ ఎత్తివేసే వరకు ఉద్యమిస్తామన్నారు. 6వ రోజు పాదయాత్రలో 200కుపైగా మంది పాల్గొన్నారు. కేవీపీఎస్ నాయకులు లక్ష్మయ్య, మల్లేష్, రామచంద్రయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

'జీవన్‌ధాన్'కు అవయవదానం


మోహనచారి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు జీవన్‌ధాన్‌కు దానమిచ్చారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని దివిటిపల్లి కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న మోహనచారి రోడ్డు ప్రమాదానికి గురై, హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆయనకు బ్రెయిన్ డెడ్ అయ్యి మిగితా అవయవాలు పని చేస్తుండడంతో విషయం తెలుసుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మోహనచారి బ్రెయిన్ మినహా ఇతర అవయవాలు పనిచేస్తుండడంతో మంత్రి సూచనల మేరకు వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవాలను జీవన్‌ధాన్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులను అభినందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు


విద్యుత్ వెలుగులతో బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం

- నేటి నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు
- నవబ్రహ్మ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ప్రముఖులు

జోగుళాంబశక్తిపీఠం: శ్రీశైలం పశ్చిమ ద్వార క్షేత్రమైన అలంపూర్ నవబ్రహ్మ ఆలయాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు గణపతి మండపం, వీరభద్ర, నంది మండపాలు, యాగశాల మండపాల్లో ఆవాయిహీత దేవత, సర్వోతభద్రమండలి, వాస్తు, క్షేత్రపాలక, చతుషష్ఠి యోగిని, నవగ్రహ మండపారాధనలు సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో చలవ పందిళ్లు, క్యూ లైన్‌లు, ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు, ఆలయ పరిసరాల్లో రంగులు, విద్యుత్ దీపాల అలంకరణలు సిద్ధం చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు గోపూజ, ఆలయ ప్రదక్షిణలు, అనతి స్వీకరణ, ఆలయ ప్రవేశం, పుణ్యాహవచన, కంకణ ధారణ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, పర్యాగ్నికరణ హోమాలు భేరీ పూజ, ధ్వజారోహన కార్యక్రమాలు విశేషంగా జరుగుతాయని ఆలయ ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్‌లలో వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు ఉచిత ప్రసాదం, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


దేవత మండపాలు, యంత్రాలను వేస్తున్న అర్చక స్వాములు

మహాశివరాత్రికి 'స్వర్ణలింగాభిషేకం' ప్రత్యేకత..

ఈ ఏడాది జరిగే మహాశివరాత్రికి భక్తజనకోటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి భక్తుడికి మహాశివరాత్రి ఫలితం కల్పించడానికి బాలబ్రహ్మేశ్వరజోగుళాంబ ఆలయాల మధ్య గరుడ బ్రహ్మేశ్వర ఆలయం వద్ద ప్రత్యేక స్వర్ణలింగాన్ని ఏర్పాటు చేసి భక్తులంతా అభిషేకం చేసే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఈఓ తెలిపారు. అంతేగాక ప్రధాన ఆలయంలో ఉదయం నుంచి లింగోద్భావన కాలం వరకు నమక చమకాలతో మహారుద్రాభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహిస్తున్నారు. లింగోద్భావన సమయంలో ఆకాశ జ్యోతి అనంతరం శివపార్వతుల కల్యాణం ఉంటుందన్నారు.


ఆలయ ప్రాంగణాల్లో భక్తులు

బ్రహోత్సవాలకు ప్రముఖుల రాక..

మహాశివరాత్రి బ్రహోత్సవాలకు సీఎం సతీమణి శోభమ్మ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల దంపతులు, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం, కలెక్టర్ వల్లూరు కాంత్రి, ఎస్పీ సృజన, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, తదితర ప్రముఖులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.


భద్రత ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ, ఎస్‌ఐ ఆలయ ఈఓ


ద్వాదశలింగతో భద్రమండలి

'గురుకుల విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ'

లింగాల: గురుకుల పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ రీజినల్ కోఆర్డినేటర్ వనజ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి కాట్రావత్ తరుణ్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చడంపై గురువారం కళాశాల ఆవరణలో ఆర్సీఓ విద్యార్థిని అభినందించి రూ.5 వేల ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్స్‌పాల్, అధ్యాపకుల కృషితో 14 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చడం గొప్ప విషయమన్నారు. పది పరీక్షలు దగ్గర పడుతున్నాయని ఉత్తమ గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఆమె విద్యార్థులకు సూచించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను సీఓఈ పరీక్షకు సన్నద్ధం చేయాలని ఆర్సీఓ అధ్యాపకులకు సూచించారు. చదువులతో పాటు, క్రీడలు, ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్, వైస్ ప్రిన్స్‌పాల్ వినోద్ ఖన్నా, బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


జేఈఈ మెయిన్స్ విద్యార్థికి ప్రోత్సాహకం అందజేస్తున్న ఆర్సీఓ

28 నుంచి అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, రైతుసంఘం నాయకులు

కొల్లాపూర్: ఈదమ్మ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28 నుంచి అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ రైతు సేవాసంఘం నాయకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలోని సంస్కృతి, సంప్రదాయాల్లో జాతర కూడా భాగమని, బండలాగుడు పోటీలను విజయవంతంగా నిర్వహించాలని సంఘం సభ్యులకు సూచించారు. 28న న్యూకేటగిరి విభాగం, మార్చి 1న సీనియర్ విభాగం పోటీలు ఉంటాయని వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌కిషన్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, నాయకులు నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, సాకలి నర్సింహ, బిజ్జ వేణు, నిరంజన్ రెడ్డి, కాటం జంబులయ్య, పరశురాంగౌడ్ ఉన్నారు.

బురద రాజకీయాలు మానుకోవాలి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: సామూహిక వివాహాల వేదికను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన రాజకీయ వేదికగా మార్చుకోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగం మాట్లాడారు. ఎక్కడ ఏది మాట్లాడాలో తెలియని నిస్సహాయక స్థితికి మర్రి చేరుకున్నారని.. దోచింది, దాచింది బయటకు తీసే సమయం ఆసన్నమైందన్నారు. తను ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినప్పుడు, ప్రస్తుతం అనేక వివాహాలకు హాజరవుతున్నానని.. ఎక్కడా రాజకీయాలు మాట్లాడలేదని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు తన వ్యక్తితం బాగా తెలుసని.. ఎవరెన్ని చెప్పినా ప్రతిష్ట దిగజారదని చెప్పారు. తమ పార్టీ నాయకులపై హత్యాయత్నానికి పాల్పడిన బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. సెక్షన్లు మార్చాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోలీసులు అధికారపార్టీకి బానిసలుగా పని చేయొద్దని కోరారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పనులు నత్తనడకన సాగడంతో కారుకొండ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయని రాష్ట్ర సర్కార్‌కు వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వ హయంలో వేసిన రహదారులకు మరమ్మతులు కూడా చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, అధికార పార్టీ నేతలు, అధికారులకు ధరణి పోర్టల్ కల్పతరువుగా మారిందని ఆరోపించారు. తమ కుటుంబానికి సంబంధించిన భూ వివాదం గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, కోర్టులో కేసు నడుస్తున్నా పట్టించుకోకుండా మరోవ్యక్తి పేరును ధరణిలో పొందుపర్చిన కలెక్టర్ నిర్లయంపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, నాయకులు తిమ్మాజీపేట పాండు, నారాయణగౌడ్, రాములు, అర్జునయ్య తదితరులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


వినోద్


కృష్ణ


మహ్మద్ రేహాన్

మహబూబ్‌నగర్ క్రీడలు: కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే 15వ సౌత్‌జోన్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎం.వినోద్, ఎస్.కృష్ణ, మహ్మద్ రేహాన్ రాష్ట్ర జట్టుకు ఎంపికై సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరి ఎంపికపై జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదత్ ఖాన్, అహ్మద్ హుస్సేన్, కోశాధికారి రామ్మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి సోహైల్ ఉర్ రెహమాన్ గురువారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని కోరారు.